ట్రాఫిక్ నుంచి ఉపశమనం

- కుమ్మరి కాలువపై రూ.1.02 కోట్లతో వంతెన నిర్మాణం
- మూడు రోజుల పాటు చేపట్టిన లోడ్ టెస్టింగ్ విజయవంతం
- పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డుకు వెళ్లనున్న వాహనాలు


అమలాపురంలో కుమ్మరి కాలువపై నిర్మించిన వంతెనకు లోడ్ టెస్టింగ్ చేస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

అమలాపురం టౌన్: ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అమలాపురం పట్టణ ప్రజలకు ఉపశమనం లభించింది. ఈదరపల్లి వంతెన నుంచి నల్ల వంతెన మీదుగా ఎర్ర వంతెన వరకూ ఉన్న బైపాస్ రోడ్డు కొంత ట్రాఫిక్ భారం తీరుస్తోంది. ఇప్పుడు నల్ల వంతెన సమీపంలో శ్మశానం మీదుగా ప్రవహించే కుమ్మరి కాలువ(డ్రెయిన్)పై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) నిధులు రూ.1.02 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన వంతెన వల్ల ట్రాఫిక్ సమస్యకు మరింత ఉపశమనం లభించనుంది.

నిర్మాణం పూర్తయిన ఈ వంతెన అధికారికంగా కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి రానుంది. దీనివల్ల వాహనాలు అమలాపురం పట్టణంలోకి వెళ్లే పని లేకుండా నల్ల వంతెన పక్క నుంచి పంట కాలువ వెంబడి వేసిన రోడ్డు, కొత్తగా నిర్మించిన వంతెన మీదుగా నడిపూడి లాకుల వద్ద ఈదరపల్లి–ముక్కామల బైపాస్ రోడ్డుపైకి వెళ్లే వెసులుబాటు కలుగుతోంది. దీంతో విజయవాడ, రాజమహేంద్రవరం వెళ్లే భారీ వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలు పట్టణ ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా నేరుగా ఈ కొత్త వంతెన మీదుగా బైపాస్‌లోకి వెళ్లి సమయం, దూరం ఆదా కానుంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో నిర్మించిన ఈ వంతెన పనులను అమలాపురం పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ సంయుక్త కృషితో వంతెన నిర్మాణం సాకారమైంది.

విజయవంతమైన లోడ్ టెస్టింగ్

వంతెన నిర్మాణం పూర్తయ్యాక గత మూడు రోజులుగా పంచాయతీరాజ్ జిల్లా అధికారి(ఎస్ఈ) కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబుల ఆధ్వర్యంలో జరిగిన లోడ్ టెస్టింగ్ విజయవంతమైంది. 126 టన్నుల సామర్థ్యంతో నిర్మించిన ఈ వంతెనపై గత మూడు రోజులుగా 24 గంటలూ లోడ్ టెస్టింగ్ నిర్వహించారు. మూడుదశల్లో అంటే డిఫ్లెక్షన్, టోటల్ స్ట్రెషన్, కెపాసిటీ బిల్డప్‌ల పరీక్షలు నిర్వహించారు. లోడ్ టెస్టింగ్ ప్రక్రియ శనివారం రాత్రితో ముగిసి విజయవంతం కావడంతో పంచాయతీరాజ్ ఇంజినీర్ల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

> **ట్రాఫిక్ సమస్య, దూరాభారం తీరనుంది**
>
> ఈ వంతెన నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యే కాదు దూరాభారం కూడా చాలా వరకూ తగ్గనుంది. బహుముఖ ప్రయాజనాలున్న ఈ వంతెన నిర్మాణాన్ని రేయింబవళ్లు శ్రమించి త్వరితగతిన పూర్తి చేశాం. వంతెనపై లోడ్ టెస్టింగ్ కూడా విజయవంతమైంది.
>
> – అన్యం రాంబాబు, డీఈఈ, పంచాయతీరాజ్, అమలాపురం

బాధిత కుటుంబానికి రూ.1.10 లక్షల సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సెల్‌ఫోన్స్ షాప్స్ అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సెల్‌ఫోన్ షాపు యాజమాని ఆలమూరు మండలం మూలసాధనం గ్రామానికి చెందిన అడపా మురళి(48) కుటుంబానికి ది కోనసీమ సెల్‌ఫోన్స్ షాప్స్ అసోసియేషన్ రూ.1.10 లక్షల సాయాన్ని సమకూర్చింది. కోనసీమ అసోసియేషన్‌తో పాటు మండపేట అసోసియేషన్, ఉభయ గోదావరి మొబైల్ షాప్స్ అసోసియేషన్స్ సహకారంతో రూ.1.10 లక్షల మొత్తాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని మూలస్థానం గ్రామం వెళ్లి దివంగత మురళి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ల ప్రతినిధులు ఆదివారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేజీఎన్ షబ్బీర్, అధ్యక్షుడు ఆర్ఆర్ రాజేష్, కార్యదర్శి ఎస్ఆర్‌డీ రాజేష్, దేవరపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలలు నైతిక విలువలతో మెలగాలి


ఉప్పలగుప్తంలో భక్తులకు సిద్ధాంతాల పుస్తకాన్ని అందిస్తున్న ప్రభాకర్‌రావు

ఉప్పలగుప్తం: బాలలు నైతిక విలువలతో మెలగాలని అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్‌రావు అన్నారు. మండంలోని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి ఏటిమెరకలో సత్యసాయి సేవా సమితి బాల వికాస కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలంతా పెద్దలను గౌరవించాలని సూచించారు. అనంతరం సత్యసాయి సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వల్లభరెడ్డి పల్లంరాజు, బద్రిసాయిరామ్, పేరాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత


ఈశ్వరప్రసాద్‌కు సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పట్టణానికి చెందిన కట్టా ఈశ్వరప్రసాద్ కాలి గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం భట్నవెల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈశ్వరప్రసాద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.23 వేల చెక్కును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప కలశ పూజ

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో వందలాది మంది అయ్యప్ప భక్తులు స్వామివారి కలశ పూజను శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి బ్రదర్స్ ఆధ్వర్యంలో 54 కలశాలతో అయ్యప్ప స్వామి పూజ నిర్వహించారు. ఉదయం స్వాములకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం వృద్ధ గౌతమీ గోదావరి నుంచి పవిత్ర జలాలను కలశాలతో తీసుకొచ్చారు. గురుస్వామి కొప్పిశెట్టి నారాయణరావు ఆధ్వర్యంలో కలశ పూజను నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి పెన్మత్స జగ్గప్పరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర కార్యదర్శిగా బాలార్జున


బాలార్జున

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర కార్యదర్శిగా అమలాపురానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి మాకే బాలార్జున సత్యనారాయణ నియమితులయ్యారు. బాలార్జునను వేదిక అంతర్జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నియమించారు. వేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమాదేవి నియామక పత్రాన్ని బాలార్జునకు ఆదివారం అందజేశారు. బాలార్జునను మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు


పి.మల్లవరం ఉచిత కంటి వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్లాల శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు నిర్వాహకుడు వీఆర్ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, డీఎంఆర్ శేఖర్, కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ముత్యాల జయలక్ష్మి, బోస్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల కొనుగోలు సొమ్ము పెంపు

యానాం: నియోజకవర్గ పరిధిలో షెడ్యూలు కులాలకు దీపావళిని పురస్కరించుకుని నూతన వస్త్రాల కొనుగోలుకు పుదుచ్చేరి ప్రభుత్వం ఏటా ఇచ్చే సొమ్మును పెంచారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా ఇచ్చే రూ.500ను రూ.1000కు ప్రభుత్వం పెంచిందని చెప్పారు.

రీజెన్సీ తెరవకుండా కుట్రలు పన్నుతున్నారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: మూతపడిన రీజెన్సీ సిరామిక్స్ పునఃప్రారంభం కాకుండా కొంతమంది కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1983లో యానాంలో స్థాపించిన భారీ రీజెన్సీ సిరామిక్స్ 2012లో వివిధ కారణాల వల్ల మూతపడడంతో వందలాది మంది కార్మికులు వీధిన పడ్డారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రీజెన్సీని తెరిపించి తద్వారా యానాం యువతకు ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో సంస్థ ఎండీ డాక్టర్ జీఎన్‌నాయుడుతో అనేకసార్లు చర్చించానన్నారు. దీంతో సంస్థ యాజమాన్యం ఫ్యాక్టరీని తెరిచేందుకు అంగీకరించి గత కొద్దినెలలుగా మూతపడిన ఫ్యాక్టరీలోని యంత్రాల మార్పు, సాంకేతిక పనులను పూర్తిచేసుకుని ఈ ఏడాది చివరి నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. అయితే కొందరు స్వార్థపరులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఫ్యాక్టరీని ఎట్టిపరిస్థితుల్లో తెరవకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


విలసవిల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి, గొల్లవిల్లిల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు, మార్పులు చేర్పులు సవరణ చేసుకోవడానికి రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటుచేశామని ఆమె తెలిపారు. వచ్చే నెలలో మరో రెండో రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్షిత మంచినీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పల్లం, నీళ్లరేవు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం


పల్లం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: మా అమ్మ పుట్టిన పల్లం గ్రామంలో రూ.6 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న రక్షిత మంచి నీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి అమ్మ రుణం తీర్చుకుంటానని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. పల్లం, నీళ్ళరేవు గ్రామాల్లో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే పొన్నాడకు ఆయా గ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ పల్లం గ్రామంలో ఓఎన్‌జీసీ సంస్థ పైపులను పనులుతో నష్టపోయిన 2,950 మంది లబ్ధిదారులకు మూడు విడతలుగా రూ.40 కోట్లు నష్టపరిహారం ఇచ్చామన్నారు. 4వ విడతగా సుమారు రూ.20 కోట్లు జమ చేస్తామన్నారు. రాబోయే కాలంలో చమురు సంస్థల నష్టపరిహారం అక్కచెల్లమ్మల బ్యాంకు ఖాతాల్లో పడేలా చూస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మి, సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, కోలాటి సత్యం, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, కాశి హనుమంతరావు, సంసాని నాగేశ్వరరావు, కాటం సత్తిరాజు, పాలెపు ధర్మారావు, రేకాడి వర్మ తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు బుషి

అమలాపురం రూరల్: రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం.బుషి పిలుపునిచ్చారు. ఆదివారం ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన రాష్ట్ర పార్టీ శాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పతాకం ఆవిష్కరించి రాజ్యాంగ పీఠికను అనుసరించి ప్రతిజ్ఞ చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అనుసరించనున్న విధానంపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కట్టా వేణుగోపాలకృష్ణ, మట్టా సిద్ధార్థ గౌతమ్, జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞాన ప్రకాష్, డి.రామకృష్ణ, ఈవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా మాదిగల అత్యవసర సమావేశం

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో బాబూ జగ్జీవన్ రామ్ భవనంలో జిల్లా మాదిగల అత్యవసర సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకుడు మోకాటి నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సీనియర్ నాయకులు పాల్గొని ఎస్సీ వర్గీకరణ గురించి, జిల్లా మాదిగల రాజకీయ ప్రాధాన్యత కోసం ప్రసంగిస్తారన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పుదుచ్చేరిలో క్యాట్ ఏర్పాటుకు చర్యలు

యానాం: పుదుచ్చేరిలో విద్య, ఉద్యోగ సంబంధిత కేసులను విచారించే సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) ఏర్పాటుకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే దీని గురించి క్యాట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ జ్యుడిషియల్ మెంబర్ లతా బస్వరాజ్ పాట్నీ, అడ్మినిస్ట్రేటివ్ సభ్యులు సింధుకౌల్ కౌముదితో చర్చించానన్నారు. నెలలో రెండుసార్లు కేసులు విచారించేందుకు అంగీకరించారని, దీంతో యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లకు చెందిన ఉద్యోగులకు తమ కేసులు ట్రిబ్యునల్‌లో విచారించేందుకు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం చెన్నైలో క్యాట్ ఉండటంతో ఉద్యోగులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. సమావేశంలో పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ, క్యాట్ రిజిస్ట్రార్ నాగేంద్రన్, డిప్యూటీ రిజిస్ట్రార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఆలమూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: నాలుగు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒక వేదికపై చేరుకున్నారు. ఆప్యాయతను కురిపిస్తూ ఆలింగనం చేసుకుంటూ నాటి అనుభవాలను పంచుకున్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979–80లో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం చోటుచేసుకుంది. పూర్వ విద్యార్థులు ఒకచోట చేర్చాలని ఆలోచనలో భాగంగా మిత్రులు కామవరపు మల్లికార్జునరావు, వెత్సా జవహర్‌లాల్ నెహ్రూ, గెద్దాడ రవీంద్రనాథ్, బొబ్బా ఆదినారాయణతో పాటు పలువురు పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకుని వివిధ ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపారంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఒక చోట చేర్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.1.5 లక్షలను విరాళాలుగా సేకరించి సమీప వాణిజ్య బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు నిర్ణయించారు. దాని ద్వారా వచ్చే వడ్డీని యేటా నవంబర్ 14న నిర్వహించే బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలని తీర్మానించారు. ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేయాలని పాఠశాల యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

కొత్త సభ్యులతో ఎన్జీవో అసోసియేషన్ బలోపేతం


కొత్తపేటలో మాట్లాడుతున్న ఎన్జీవో అధ్యక్షుడు రామారావు

కొత్తపేట: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కొత్తపేట తాలూకా యూనిట్‌ను కొత్త సభ్యులతో బలోపేతం చేయాలని యూనిట్ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో తాలూకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు అధ్యక్షతన జరిగింది. రామారావు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సభ్యులుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను చేర్చుకోవాలని, ఎన్జీవో సమాచారం మాసపత్రిక నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనుగోలు చేసి విధంగా కార్యవర్గ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఏపీఎన్జీవో కృషిని తాలూకాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి వివరణాత్మక విశ్లేషణ ద్వారా వివరించాలన్నారు. ఇలా వివిధ అంశాలపై చర్చించి తీర్మానించారు. సమావేశంలో తాలూకా యూనిట్ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, యూనిట్ కార్యదర్శి నల్లా వెంకటరామారావు (బాబి), ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి శామ్యూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి


విఘ్నేశ్వరుని దర్శించుకుంటున్న రాజీవ్ దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని రాజమహేంద్రవరం మొదటి అదనపు జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనన్నా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేలకొరిగిన వరి చేను


పోలేకుర్రులో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి చేను

తాళ్లరేవు: పంట చేతికొచ్చే వేళ వరుణుడు కన్నెర్ర చేస్తున్నాడు. గత నాలుగు రోజులుగా మండలంలోని అనేక గ్రామాల్లో ఈదురుగాలులు, వర్షాల కారణంగా వరి చేలు నేలకొరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో పంట కోతకు వస్తుందన్న సమయంలో వరిచేలు నేలమట్టం కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాబోయే రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతన్నలకు కంటి మీద కునుకు కరవవుతోంది. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, ఈ సమయంలో వర్షాలు కురిస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన చెందుతున్నారు.

పేద విద్యార్థినికి సాయం


విద్యార్థినికి సాయం అందిస్తున్న అబ్బిరెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు సురేష్

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లి గ్రామానికి చెందిన గొర్తి శ్రీవైష్ణవి డిగ్రీ మొదటి సంవత్సరం ఫీజు నిమిత్తం రూ.5 వేలను అబ్బిరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ సమకూర్చింది. విద్యార్థినికి మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయుడు మలిశెట్టి మూర్తి చేతుల మీదుగా బ్యాంకు చెక్కును ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో గంగుమళ్ళ శ్రీనివాస్, దూడల ఫణి, చవటపల్లి కిషోర్, పోలిశెట్టి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మామిడికుదురు: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రముఖ యోగా గురువు ఆకుల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మామిడికుదురు ఖేతన్ యోగా కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో యోగా గురువు ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. యోగాసనాలతో పాటు విద్యార్థులు కూచిపూడి నృత్యం కూడా చేశారు. కార్యక్రమంలో మ్యూజిక్ థెరపీ, వైద్య నిపుణులు గురు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, ఆకుల లక్ష్మీనారాయణ, పార్వతి, జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

